సాక్షి తిరుపతి

బుధవారం। 29। మే। 2024



జాతర కోలాహలం

నాయుడుపేటలో జాతర కోలాహలం నెలకొంది. గ్రామ దేవత పోలేరమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. - 8లో



'కౌంట్'డౌన్

ఎన్నికల కౌంటింగ్‌కు సమయం ఆసన్నమైంది. మరో ఐదు రోజుల్లో కౌంటింగ్ ప్రక్రియ పూర్తికానుంది. - 8లో



ముమ్మర తనిఖీలు

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అసాంఘిక శక్తులు రాకుండా జిల్లాలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

మెరుగైన పారిశుద్ధ్యం కోసం కఠిన చర్యలు



ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: తిరుపతిలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం కఠిన చర్యలు తీసుకోక తప్పదని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అన్నారు. మంగళవారం ఆమె హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌తో కలిసి పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో కలియతిరిగారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించుతున్న తీరు, రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త తీసుకుంటున్నారా లేదా..? వ్యాపార సముదాయాల వద్ద చెత్త నిర్వహణ ఎలా ఉంది..? అన్న వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే రైల్వే పార్సిల్ ఆఫీసు ఎదురుగా నిర్మిస్తున్న మల్టీ లెవల్ కార్ పార్కింగ్, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న సీటీసీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిశుభ్ర తిరుపతి కోసం రాజీలేని నిర్ణయాలు తీసుకోక తప్పదన్నారు.. క్లీన్ తిరుపతిలో ప్రజలంతా భాగస్వాములైతే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. తిరుపతి నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామన్నారు. ఎస్సీ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డీఈఈ రాజు, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీకి యత్నం

చిల్లకూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన మండలంలోని కడివేడులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. కడివేడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు వేసవి సెలవుల కారణంగా హెచ్ఎంతో పాటుగా ఉపాధ్యాయులు అన్నింటికీ తాళాలు వేసుకుని వెళ్లారు. అయితే సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ల్యాబ్ గది తాళలాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు తాళాలు పగుల గొట్టి ఉండడంతో ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఏఎస్ఐ ప్రభాకర్, కానిస్టేబుల్ క్రిష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గదిలోని కంప్యూటర్లను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

మెనూ తప్పనిసరి



ఆర్.మల్లవరం అంగన్‌వాడీ కేంద్రంలో పీడీ జయలక్ష్మి

రేణిగుంట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిషోర బాలికలు, గర్భవతులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి ఆదేశించారు. రేణిగుంట మండలం, ఆర్.మల్లవరం, కుమ్మరపల్లి, దిగువ మల్లవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పిల్లల హాజరును పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. కిషోర బాలికల ఆటపాటలను పరీక్షించారు. కిషోర బాలికలకు అందించే పౌష్టికా హారం, వారి వయస్సు రీత్యా జరిగే శారీక, మానసిక మార్పులను గురించి సంపూర్ణ అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సూపర్‌వైజర్లు హేమావతి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తులపై జరగని దాడిని జరిగినట్టు నమ్మించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. రెచ్చగొట్టేలా దాడులకు ప్రేరేపించే నటనలతో మనసుల్లో విషం నింపారు. చంద్రగిరి రౌడీ మూకలతో చిత్తూరు, తిరుపతి రౌడీలు జతకలిశారు. కన్నూమిన్ను కానకుండా రెచ్చిపోయారు. గుండాలు, రౌడీ బ్యాచ్ తిరుపతిలో మారణాయుధాలు, కర్రలు, రాడ్లతో బీభత్సం సృష్టించారు. అమాయకులు, ప్రయాణికులు, వర్సిటీ ఉద్యోగులపై దాడులకు పాల్పడ్డారు. తలలు పగులగొట్టి.. కాళ్లు, చేతులు విరిచేశారు. ఈ భయానక ఘటనలకు సంబంధించిన ఆధారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అరాచకశక్తులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. నమోదైన కేసులను బట్టి చూస్తే విధ్వంసకారులకు పదేళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో అరెస్టులకు భయపడి అరాచక మూకలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాయి.



మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూం సమీపంలో కారును ధ్వంసం చేసిన అల్లరిమూకలు (ఫైల్)

నాడు విధ్వంసం.. నేడు అజ్ఞాతవాసం

నిందితులకు పడే శిక్షలు ఇవే

సెక్షన్ 307	హత్యాయత్నం. బాధితుడికి తీవ్రగాయం అయితే జీవిత ఖైదు పడే అవకాశం. లేదా పదేళ్ల జైలు, జరిమానా రెండూ విధించవచ్చు.
సెక్షన్ 147	అల్లర్లకు పాల్పడినందుకు, రెండేళ్ల వరకు జైలు, లేదా జరిమానా..
సెక్షన్ 148	మారణాయుధాలతో అల్లర్లకు పాల్పడడం, మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా
సెక్షన్ 120బీ	నేరపూర్వక కుట్రకు పాల్పడడం, ప్రధాన నిందితుడికి పడిన శిక్షతో సమానంగా నేర ఘటనల్లో భాగస్వామి అయ్యి ప్రజా ప్రశాంతతకు వ్యతిరేఖంగా నేరాలకు పడే శిక్ష పడుతుంది. రెండేళ్ల నుంచి జీవిత ఖైదు పడే అవకాశం.
సెక్షన్ 323	పదునైన వస్తువుతో గాయపరచడం, ఏడాది జైలు, జరిమనా పడే అవకాశం
సెక్షన్ 324	ప్రమాదకరమైన ఆయుధాలు ద్వారా గాయపరచడం, మూడేళ్ల వరకు జైలు, జరిమానా పడే అవకాశం
సెక్షన్ 506 రెడ్‌విత్	నేరపూరిత బెదిరింపులు, తీవ్ర గాయానికి కారణమైతే... రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు
సెక్షన్ 149	గుంపుగా అల్లర్లకు పాల్పడడం, ఏడాది వరకు జైలు

హత్యాయత్నం కేసుతో బిగుస్తున్న రౌడీషీట్ ఉచ్చు!

- 37 మంది నిందితులపై ఇప్పటికే హత్యాయత్నం కేసులు
- బయటకు వస్తున్న అరాచకాల వీడియోలు, ఆడియోలు
- నాన్–బెయిలబుల్ కేసులతో 10 ఏళ్లు శిక్ష పడే అవకాశం
- అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి నిందితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎన్నికల సందర్భంగా చంద్రగిరి, తిరుపతి రూరల్‌లో బీభత్సం సృష్టించి కేసుల్లో ఇరుక్కున్న అల్లరిమూకలు అరెస్టులకు భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నాటి ఘర్షణల్లో పాల్గొన్న 37 మందిపై తాజాగా పోలీసులు కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో నాడు గాయపడిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తమపై మారణాయుధాలతో దాడులు చేసిన విధానం, అందులో తాము రక్త గాయాలు పాలుకావడం, భయంతో బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు పారిపోవడం, అక్కడ వైద్యం చేయించుకోవడం, ఎమ్మెల్సీ సర్టిఫికెట్ తీసుకుని, వీడియో ఆధారాలతో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు అప్పటి వీడియోలు, ఆడియోల ఆధారంగా మరికొందరిపై హత్యాయత్నం కేసులు నమోదుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఆ 37 మందిపై రౌడీషీట్

పోలింగ్ తర్వాత రోజు మహిళా వర్సిటీ వద్ద జరిగిన బీభత్సం తాలుక ఘటనల్లో పలువురి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో ముమ్మర దర్యాప్తు చేపట్టారు. రాడ్లు, మారణాయుధలతో దాడులు చేయడం, దాడులు చేస్తున్న వారిని ప్రోత్సహించడం, స్వయంగా దాడుల్లో పాల్గొన్నారనే కారణాలతో 37 మందిపై వర్సిటీ పోలీసులు కేసులు నమోదు చేశారు. హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, ప్రమాదకర ఆయుధాలతో దాడి, బాధితులను బెదిరించడం, మూకుమ్మడిగా అల్లర్లకు పాల్పడడం, తీవ్రమైన గాయాలు చేయడం.. వంటి కారణాలతో మొత్తం 8 సెక్షన్లపై కేసులు నమోదు చేశారు. కనీసం 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్న సెక్షన్లు కావడంతో కేసు తీవ్రత ఎక్కువగా ఉంది. కేసు నమోదైన 37 మందిపై రౌడీషీట్ తెరిచే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం నమోదైన హత్యాయత్నం కేసులో ఉన్న వారిలో చాలామందిపై గతంలోనే పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయి. గతంలోనూ హత్యాయత్నం కేసులు ఉన్న వారు కూడా ఇందులో ఉన్నారు. వారి పూర్వ నేర చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకుని అలాంటి వారిపై పీడీ యాక్టు కూడా నమోదు చేసే అవకాశం ఉంది.

చిత్తూరులో గాలింపు చర్యలు



దగ్ధమవుతున్న మోహిత్‌రెడ్డి కారు (ఫైల్)

చిత్తూరు నుంచి అనేకమంది చంద్రగిరికి వచ్చి దాడుల్లో పాల్గొన్నారు. రాడ్లు, మారణాయుధాలతో ఇష్టారాజ్యంగా అమాయకులను రక్తగాయాల పాలు చేసినట్లు వీడియోల్లో నమోదైంది. ఇప్పటికే వారి పేర్లు, చిరునామాలు గుర్తించారు. కేసుల నమోదుతో వీడియోలో ఉండి దాడుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందం ఇప్పటికే చిత్తూరులో మకాం వేసింది. ముమ్మర గాలింపు చర్యలు చేపడుతోంది. వర్సిటీ ఘటనలతో పాటు కూచువారిపల్లి దాడుల్లోనూ చిత్తూరు మూక హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

నాన్–బెయిలబుల్ కేసులు... పరారీలో నిందితులు

కన్నూమిన్ను కానకుండా విధ్వంసం సృష్టించి, మారణాయుధాలతో దాడులకు తెగబడిన రౌడీ గ్యాంగ్‌పై పలు సెక్షన్ల కింద 37 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో నాన్–బెయిలబుల్ సెక్షన్లు సైతం ఉండడం, పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉండడం, స్టేషన్ బెయిల్ కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో నిందితులు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు సమాచారం. ఎన్నికల తర్వాత జరిగిన ఘటనల్లో నమోదైన కేసులపై ఎన్నికల సంఘం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం, పోలీసు అధికారులు కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో నిందితులను అరెస్ట్ చేసేందుకు వర్సిటీ పోలీసులు ముమ్మర యత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కేసులో ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. పోలీసులు వస్తున్నారని తెలిసి నిందితులు పరారయ్యారు. నిందితుల ఫోన్ లోకేషన్ ద్వారా అయినా అరెస్ట్ చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కేసులో ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తామని, ఎవ్వరినీ వదలమని ఇప్పటికే తిరుపతి జిల్లా ఎస్పీ ప్రకటించారు.



మొదలియార్ రమేష్‌పై దాడి చేస్తున్న గూండాలు (ఫైల్)



మహిళావర్సిటీ వద్ద రోడ్డుపై బీభత్సం సృష్టిస్తున్న అల్లరి మూకలు (ఫైల్)

గాయపడి.. భయపడి.. పారిపోయి సర్జరీలు చేసుకొచ్చి ఫిర్యాదు

వర్సిటీ ముందు జరిగిన ఘర్షణలో మారణాయుధాలు, కర్రలు, రాడ్లతో దాడులు చేయడం వల్ల పెద్ద సంఖ్యలో అమాయకులకు తీవ్రంగా రక్తగాయాలయ్యాయి. మరికొందరికి కంటి చూపు దెబ్బతింది. ఇంకొందరికి అత్యవసరంగా సర్జరీలు చేసుకోవాల్సి వచ్చింది. నాటి దాడుల్లో గాయపడిన కొందరు భయంతో రక్తగాయాలతోనే బెంగళూరు, చెన్నై నగరాలకు పారిపోయారు. అక్కడే అత్యవసర చికిత్సను తీసుకుని ప్రాణాలను కాపాడుకున్నారు. తాజాగా పోలీసులు నాటి ఘర్షణల్లో పాల్గొన్న 37 మందిపై కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేయడంతో బాధితులు ధైర్యం తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్సీ సర్టిఫికెట్లు, నాడు తమకు తగిలిన రక్తగాయాలకు సంబంధించిన సర్జరీలు, డాక్టర్ల రిపోర్టులతో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అందులో భాగంగానే వర్సిటీ వద్ద తనపై దాడికి సంబంధించిన వీడియో ఆధారాలతో కొటాలకు చెందిన విరుపాక్ష హేమంత్ తిరుపతి ఎస్పీని ఆశ్రయించాడు. మారణాయుధాలతో దాడి చేయడం వల్ల తన కంటికి తీవ్ర గాయం కావడం, 11 కుట్లు వేయాల్సి రావడం, అందుకు సంబంధించిన వైద్య నివేదికలను పోలీసులకు అందించాడు.

ఖరీఫ్‌నకు గంగ బెంగే!



వెంకటరమణ, చీఫ్ ఇంజినీర్, జలవనరులశాఖ

తిరుపతి అర్బన్: ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలుగుగంగ నీటిని సాగుకు వదలడం వీలుకాదని జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ స్పష్టం చేశారు. ఆయన తిరుపతిలోని తన చాంబర్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 68.2 టీఎంసీల సామర్థ్యం కల్గిన కండలేరు జలాశయంలో ప్రస్తుతం నీటి సామర్థ్యం చాలా తక్కువగా ఉందన్నారు. కేవలం 16.73 టీఎంసీల నీరు ఉందని.. ఇందులో 7.5 టీఎంసీల నీరును నిల్వ ఉంచాల్సి ఉందని వెల్లడించారు. మిగిలిన 3 టీఎంసీల నీటిని తాగడానికి వినియోగించాల్సి వస్తుందని పేర్కొన్నారు. దీంతో ఖరీఫ్ సీజన్‌కు సాగునీటినిచ్చే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. తెలుగు గంగ కాలువ నీటి ఆధారంగా వరి నార్లు పోయరాదని సూచించారు. అయితే వర్షాలు కురిసి కండలేరు జలాశయానికి నీరు వస్తే తరువాత సాగుకు నీటినిచ్చే అంశాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి తాగునీటికి సంబంధించి 45 రోజులకు అవసరమైన నీరు రామాపురం రిజర్వాయర్‌లో నిల్వ ఉందని, ఆ నీరు చివరి దశకు చేరుకుంటే ఆ సమయంలో తెలుగుగంగ నీటిని కేవలం తాగునీటికి మాత్రమే అందజేస్తామని చెప్పారు.

నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

కార్వేటినగరం : వేణుగోపాలస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవర్లకు అభిషేకం, తోమాల సేవ, సహస్రనామార్చన జరిపించారు. సాయంత్రం సంప్రదాయబద్ధంగా శాత్తుమొర చేపట్టారు. ఈ క్రమంలోనే సేనాపతి ఉత్సవం చేశారు. రాత్రి 7.15 గంటలకు అంకురార్పణతో సకల దేవతలకు ఆహ్వానం పలికారు.

మోడల్ కౌంటింగ్ నేటితో ఆఖరు



కలెక్టరేట్‌లో మోడల్ కౌంటింగ్‌లో ఉద్యోగులు



మోడల్ కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లో మోడల్ కౌంటింగ్ నేటితో ముగియనుంది. కౌంటింగ్ విధుల్లోని ప్రతి ఉద్యోగి వంద శాతం కౌంటింగ్‌పై అవగాహన పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రెండో రోజు కలెక్టరేట్‌లో మోడల్ కౌంటింగ్ ప్రక్రియను కొనసాగించారు. మూడు రోజుల పాటు చేపట్టిన ఈ కౌటింగ్ ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. ఈ మేరకు మోడల్ కౌంటింగ్ కేంద్రాలన్నీ కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, సూళ్లూరుపేట రిటర్నింగ్ అధికారి చంద్రముని, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సుశీలదేవి, ఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై కల్యాణ వెంకన్న అభయం



నాలుగు మాడ వీధుల్లో స్వర్ణరథంపై ఊరేగుతున్న దేవదేవేరులు

- నేటితో ముగియనున్న వసంతోత్సవాలు



స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామివారి స్వర్ణరథోత్సవం కనుల పండువగా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొల్పి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకించారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చంగల్‌రాయలు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో తిరుపతి గంగమ్మ

తిరుపతి గంగమ్మకు మరు పొంగళ్లు

- వేషాలు వేసి, నైవేద్యాలు సమర్పించిన స్థానికులు

స్మరిస్తూ..తరిస్తూ!



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తిరుపతి కల్చరల్: 'గంగమ్మా.. చల్లంగా చూడమ్మా' అంటూ భక్తులు ప్రణమిల్లారు. వేషాలు వేసి, జంతుబలులిచ్చి, నైవేద్యాలు సమర్పించి, అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం స్థానిక తాతయ్యగుంట గంగమ్మకు మరు పొంగళ్లు పెట్టి ఆధ్యాత్మిక ఆనందంలో మునిగి తేలారు. గంగజాతర తర్వాత వచ్చిన తొలి మంగళవారం కావడంతో వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు గంగవేషాలు ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు చెల్లించారు. మరి కొందరు వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని వేడుకున్నారు. రంగస్థలి కళాకారులు వివిధ వేషాలు ధరించి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ ఈఓ కె.మమత భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బ తిన్న స్కూటీ

చిట్టమూరు(చిల్లకూరు): స్కూటీపై వెళ్తున్న ముగ్గురిని ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న ముగ్గురికీ గాయాలైన ఘటన చిట్టమూరు మండలం, రొయ్యల వాగు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు.. నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే యానాటి వనజావతి వేసవి సెలవుల నేపథ్యంలో ఇటీవల తన సొంతూరైన వాకాడుకు ఇద్దరి పిల్లను తీసుకుని వెళ్లింది. మంగళవారం పిల్లలతో కలిసి స్కూటీపై నాయుడుపేటకు బయలుదేరింది. ఈ క్రమంలో చిట్టమూరు- వాకాడు మండలాల మధ్యలో ఉన్న రొయ్యల వాగు వద్ద చిట్టమూరు నుంచి వస్తున్న ఓ గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ముగ్గురికీ గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని నాయుడుపేటకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లోని రైల్వే ప్రయివేట్ క్యాంటీన్ వద్ద సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు చనిపోయి పడి ఉన్నాడని రైల్వే ఇన్‌చార్జి ఎస్‌ఐ కే.కొండప్పనాయుడు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో ప్లాట్‌ఫాం నం.1పై ఓ వృద్ధుడు ఎండకు స్పృహ తప్పి పడిపోయాడని ప్రయాణికుల ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే డాక్టర్‌ను తీసుకుని వెళ్లే సరికి అప్పటికే ఆ వృద్ధుడు చనిపోయి ఉన్నాడని డాక్టర్ నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు లైట్ బ్లూ హాఫ్ షర్టు, నీలం రంగు పెద్ద గళ్ల లుంగీ, నేవీబ్లూ పెల్ బన్నియన్ ధరించి ఉన్నాడు. జుట్టు అంతా నెరిసిపోయి ఉంది. అయితే స్థానికుడై ఉండొచ్చని రైల్వే పోలీసులు అనుమానించి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. బుధవారం సాయంత్రం దాకా చూసి తరువాత పోస్టుమార్టం నిర్వహించి మున్సిపాలిటీకి అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

నాయుడుపేటలో జాతర కోలాహలం

- పోలేరమ్మకు ప్రత్యేక పూజలు
- ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు



పోలేరమ్మ ఆలయం వద్ద అంబళ్లు పోస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట గ్రామ దేవత శ్రీపోలేరమ్మ జాతర కోలాహలంగా ప్రారంభమైంది. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శశాంక్, విన్నమాల గ్రామ పెద్ద కాపు ఆరవభూమి శ్రీనివాసులురెడ్డి, మణి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాతర వేడుకల్లో మొదట అమ్మవారి ఆలయం వద్ద భక్తులు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ సమీపంలో పోలేరమ్మ ప్రతిమను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు ఇంటింటికీ వేళ్లి మడి భిక్షం సేకరించారు. రాత్రి పడమటి వీధిలోని అంకాళమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని పూజలు నిర్వహించి, సమీపంలో ఉన్న కుమ్మరి ఇంటి వద్ద మట్టితో తయారు చేసిన పోలేరమ్మ ప్రతిమను రహస్యంగా అలంకార గుడికి తరలించారు. పోలేరమ్మ ప్రతిమను మంగళవారం అర్ధ రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సప్పరంపై ఉంచి ప్రధాన వీధుల్లో ఊరేగించనున్నారు. పోలేరమ్మ ఆలయం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బేరిపేట, అలంకారగుడి తదితర ప్రాంతాలలో విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. భారీ షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులు వెయ్యి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని, ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. పెదకాపు శ్రీనివాసులు రెడ్డి, ఆకుల కుబేరు మణి, నల్ల బోతుల రామారావు, ధార రవి, గాలి రమేష్‌నాయుడు, సిద్ది లింగం రాజేష్, దేవత చెంచు కిషోర్‌శెట్టి, శేషం గోపి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి, పోతురాజు



మడి బియ్యం సేకరిస్తున్న స్థానికులు

నిషేధిత భూముల్లో నిర్మాణాలు ఆపండి



మంగళంలోని అనాధీన భూమిలో నిర్మిస్తున్న నిర్మాణాలు

తిరుపతి మంగళం: మంగళం ప్రధాన మార్గంలోని నిషేధిత భూముల్లో నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపాలని రెవెన్యూ అధికారులు నిర్మాణదారులకు హెచ్చరికలు జారీచేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంగళం లెక్కదాఖలాలోని సర్వే నం.31లో అనాధీనం భూమిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న వారికి నోటీసులు జారీచేశారు. సర్వే నం.31లో అనాధీనం భూమిలో మీకేమైనా రికార్డులు ఉంటే వాటిని జూన్ 7వ తేదీలోపు తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చి చూపించాలన్నారు. అలా కాకుండా సదరు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలావుండగా తమ వద్ద కోర్టు ఇచ్చిన పర్మిషన్ ఇంజక్షన్ ఆర్డర్ ఉందని నిర్మాణదారులు రెవెన్యూ అధికారులకు వివరించారు.

ఆకలి రహిత సమాజమే లక్ష్యం



అన్నదాన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, షోరూం హెడ్ రెజిష్

- నిత్యాన్నదానాన్ని ప్రారంభించిన మలబార్

తిరుపతి కల్చరల్: ఆకలి రహిత సమాజ సాధనే లక్ష్యంగా మలబార్ గ్రూప్ అడుగులు వేసింది. వరల్డ్ హంగ్రర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పేదలకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రకాశం రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం వద్ద ఏర్పాటు చేసిన నిత్యాన్నదానం వాహనాన్ని మేయర్ డాక్టర్ శిరీష జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు నగల వ్యాపారంతో పాటు సామాజిక సేవా దృక్పథంతో పేదల ఆకలి తీర్చేందుకు నితాన్నదాన కార్యక్రమానికి మలబార్ గ్రూప్ ప్రతినిధులు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజ హితం కోసం కృషి చేయాలని కోరారు. షోరూం హెడ్ రెజిష్ మాట్లాడుతూ రోజూ 51 వేల మంది నిరుపేదలకు పౌష్టికాహారం పంపిణీ చేసేందుకు మలబార్ గ్రూప్ అధినేతలు నిర్ణయించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి మలబార్ బంగారు డైమండ్స్ షోరూం ద్వారా నిరుపేదలకు పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. రోజూ మంచి పౌష్టికాహారాన్ని వాహనం ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మలబార్ షోరూం ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన గంగమ్మ జాతర

- సారె సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి
- గ్రామాలు సస్యశ్యామలంగా, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థన



తుమ్మలగుంటలో ఊరేగింపుగా సారె తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో గంగమ్మ జాతర వేడుకలు అత్యంత వేడుకగా సాగాయి. ప్రజలు భక్తి శ్రద్ధలతో గంగమ్మ తల్లిని పూజించారు. పొంగళ్లుపెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గంగమ్మకు సారె సమర్పించారు. జాతర సందర్భంగా తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. పాత కాల్వ, పేరూరు, వెంకటపతి నగర్, తుమ్మలగుంట గ్రామాలలో గంగమ్మకు సారె అందజేశారు. ఆయా గ్రామాలకు చేరుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి గ్రామస్తుల నుంచి ఘనంగా స్వాగతం లభించింది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సారె ఊరేగింపు సాగింది. అనంతరం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుని, ఆలయ అర్చకులకు సారె అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలు సుభిక్షంగా జీవితాన్ని గడిపేలా ఆశీర్వదించాలని గంగమ్మను ప్రార్థించినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

- ఐదుకు చేరిన మృతుల సంఖ్య



మృతి చెందిన నీరజ

చంద్రగిరి: చంద్రగిరి మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి సమీపంలోని సోమవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నీరజ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నెల్లూరు జిల్లా, ఇందుకూరిపేట మండలం, నరసాపురానికి చెందిన నీరజ(38), ఆమె భర్త శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారిని తిరుపతి రుయాకు తరలించారు. నీరజకు ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డ కట్టడంతో పరిస్థితి విషమించిందని డాక్టర్లు వివరించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 9.40 గంటలకు ఆమె మృతి చెందినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. అనంతరం నీరజ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి భర్త శ్రీనివాసులుకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఆయన తలకు బలమైన గాయం కావడంతో పాటు రెండు కాళ్లు విరిగిపోయాయి. మెరుగైన వైద్యం కోసం శ్రీనివాసులను నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వారి బంధువులు తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది

కౌంటింగ్ డౌన్!



శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

- కౌంటింగ్ పైనే అందరి చూపు
- ఎన్నికల కౌంటింగ్‌కు ఇక ఐదు రోజులే
- ఒక్కో రౌండ్‌కు 20 నిమిషాల నుంచి 30 నిమిషాల సమయం
- ఈ సారి 21 రోజులుగా ఎదురు చూపు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తున్న కొద్దీ అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. ఎక్కడ చూసినా కౌంటింగ్ పైనే చర్చ సాగుతోంది. మరో పక్క జూన్ 4న తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ చేపట్టడానికి శరవేగంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని తిరుపతి పార్లమెంట్‌తోపాటు తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కించాల్సి ఉంది. ఆ మేరకు ఏర్పాట్లు తుది దశకు చేరాయి.

ఫలితాల కోసం ఎదురుచూపులు

2019లో ఏప్రిల్ 11న ఎన్నికలు జరగ్గా ఫలితాల కోసం 41 రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి 21 రోజులుగా వేచి ఉండాల్సిన పరిస్థితి. కౌంటింగ్‌కు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. వచ్చే మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. ఒక్కో రౌండుకు 20 నుంచి 30 నిమిషాల సమయం పడుతుంది. ఈ మేరకు మధ్యాహ్నం 1.30 నుంచి రెండు గంటల సమయానికి తిరుపతి 20 రౌండ్లు, సత్యవేడు 20, చంద్రగిరి 20 రౌండ్ల ఫలితాలు వస్తాయని అంచనాలు వేస్తున్నారు. తర్వాత 3 గంటలకు శ్రీకాళహస్తి 21 రౌండ్లు, గూడూరు 21 రౌండ్లు ఫలితాలు వస్తాయని లెక్కలు గడుతున్నారు. చివరిగా 4 గంటల్లోపు సూళ్లూరుపేట 22 రౌండ్లు, వెంకటగిరి 22 రౌండ్లు ఫలితాలు తెలుస్తాయని అంచనాలు వేస్తున్నారు. మొత్తంగా సాయంత్రం 4 గంటలకు అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తి చేయొచ్చని వెల్లడిస్తున్నారు.

తెలుగులోనే సూచిక బోర్డులు

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో 30 స్ట్రాంగ్ రూమ్‌లు, 10కిపైగా బ్లాక్‌ల్లో ఒక పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో అందరికి ఈజీగా ఉండేందుకు తెలుగులోనే సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఆ మేరకు చర్యలు చేపడుతున్నారు.

కౌంటింగ్‌కు చురుగ్గా ఏర్పాట్లు



తుది దశకు కౌంటింగ్ ఏర్పాట్లు

జూన్ 4వ తేదీ మంగళవారం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో చురుగ్గా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే 95 శాతం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. జూన్ 1వ తేదీనాటికి 100శాతం ఏర్పాట్లు పూర్తవుతాయన్నారు. ప్రధానంగా ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతోందని, అన్ని పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు, ప్రజలు సహకరించాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీ

- ముగ్గురికి గాయాలు

కోట: విద్యానగర్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం రెండు మోటార్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గోవిందపల్లిపాళెంకు చెందిన గోవర్ధన్, వెంకటేశ్వర్లు చిట్టేడుకు మోటార్ బైక్‌లో వెళ్తుతుండగా ఎదురుగా విద్యానగర్‌కు చెందిన వ్యాపారి బాలసుబ్రమణ్యం మోటార్ బైక్‌లో వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గోవర్ధన్, వెంకటేశ్వర్లు, బాలసుబ్రమణ్యంను స్థానికులు కో ట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విచార ణ జరుపుతున్నట్టు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

జిల్లాలో ముమ్మర తనిఖీలు



తిరుపతిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



తిరుపతి క్రైమ్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సీఐలు, ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీలతో కలిసి చెక్‌పోస్టులు, ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పనిచేసేందుకే ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలు శాంతియుత వాతావరణంలో ఉండేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, అనుమానితులను పోలీసు అధికారులు బైండోవర్ చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు.

తిరుపతిలో ఫ్లాగ్ మార్చ్

అసాంఘిక శక్తులకు హెచ్చరికలు జారీ చేస్తూ తిరుపతి ఈస్ట్ పోలీసులు, ప్రత్యేక బలగాల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. కౌంటింగ్ దృష్ట్యా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం చేపట్టడం వల్ల ప్రజల్లో చైతన్యవంతం వస్తుందని పేర్కొన్నారు.

సీఐలపై దాడి చేసినా అంతేనా?

- నలుగురు టీడీపీ కార్యకర్తలకు రిమాండ్, బెయిల్

తిరుపతి లీగల్ : తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ సమీపంలో విధి నిర్వహణలోని సీఐలు రామచంద్రారెడ్డి, తిరుపతి రూరల్ సీఐపై దాడి చేసిన కేసులో నలుగురు టీడీపీ కార్యకర్తలకు తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జూన్ 10వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. అయితే నలుగురిపై పోలీసులు బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంతో న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నలుగురూ రూ.10 వేలు, ఇద్దరు జామీను దారుల పూచీ కత్తుపై విడుదలయ్యారు. అరెస్ట్ అయిన వారిలో చిత్తూరు రూరల్ మండలం, మంగసముద్రం హౌసింగ్ కాలనీకి చెందిన రఘులోకేష్, పాకాల మండలం, మల్లెల చెరువుపల్లికి చెందిన నారిశెట్టి భరత్, రామచంద్రపురం మండలం, కమ్మకండ్రిగకు చెందిన గడ్డం శివకృష్ణసింగ్, హరీష్ కుమార్ ఉన్నారు. ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు ఈ నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

బెయిలబుల్ సెక్షన్లేనా?

ఇద్దరు సీఐలపై మారణాయుధాలతో దాడి చేసిన టీడీపీ కార్యకర్తలపై బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం చాలా బాధాకరమని న్యాయవాదులు అంటున్నారు. పోలీస్ అధికారులపై అతి క్రూరంగా దాడి చేసిన టీడీపీ కార్యకర్తలపై అత్యంత కఠినమైన సెక్షన్ల కింద కేసు పెట్టి అరెస్టు చేయలేని స్థితికి పోలీసు వ్యవస్థ రావడం, దీనిపై ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టలేక పోవడం దారుణమని పేర్కొంటున్నారు. పోలీస్ వ్యవస్థపై గౌరవం పెరగాలంటే టీడీపీ కార్యకర్తలపై నమోదైన సెక్షన్లను మార్చి నాన్ బెయిల్ బుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు.